## క్లుప్తంగా

### న్యాయం జరుగుతుందనే నమ్మకం కల్పించాలి

**జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ**

**గాంధీనగర్(విజయవాడసెంట్రల్):** కలెక్టరేట్ అధికారులు, సిబ్బంది క్రమశిక్షణతో పనిచేసి కలెక్టరేట్ గౌరవం పెంచాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ సూచించారు. కలెక్టరేట్ శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో బుధవారం కలెక్టరేట్‌లోని సమన్వయ, మెజిస్టీరియల్, ఎలక్షన్స్, ల్యాండ్ తదితర సెక్షన్ల అధికారులు, సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కలెక్టరేట్‌కు వెళితే తమకు తప్పకుండా న్యాయం జరుగుతుందనే నమ్మకం కల్పించాలన్నారు. విధి నిర్వహణలో ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యం ఉండకూడదని కలెక్టర్ లక్ష్మీశ స్పష్టం చేశారు. సమావేశంలో డీఆర్‌వో ఎం.లక్ష్మీ నరసింహం, కలెక్టరేట్ ఏవో ఎస్.శ్రీనివాసరెడ్డి, వివిధ సెక్షన్ల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

### భక్తిశ్రద్ధలతో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు



**మధురానగర్(విజయవాడసెంట్రల్):** దుర్గాపురం శ్రీ అయ్యప్పస్వామి మందిరంలో బుధవారం కార్తిక మాసోత్సవాలలో భాగంగా శ్రీ మణికంఠ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు జరిగాయి. శివకేశవులకు అత్యంత ప్రీతికరమైన కార్తిక మాసం కావటంతో పెద్ద సంఖ్యలో భక్తులు వ్రతాలలో పాల్గొని భక్తిశ్రద్ధలతో సత్యనారాయణ స్వామి వ్రతం ఆచరించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు కార్తిక మాసంలో సత్యనారాయణ స్వామి వ్రతం విశిష్టతను వివరించారు. ఈ మాసంలో ప్రతి ఒక్కరూ సత్యనారాయణ స్వామి వ్రతం చేసుకోవాలనే సదుద్దేశంతో తాము ప్రతి ఏటా సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహిస్తున్నట్లు గురుస్వామి బల్లెం పూర్ణయ్య స్వామి తెలిపారు. అనంతరం అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు అభిషేకాలు, భక్తులకు అన్నప్రసాద వితరణ జరిగింది.

### సద్గురువులకు స్వర నీరాజనం



**విజయవాడ కల్చరల్:** శ్రీ సద్గురు సంగీత సభ ఆధ్వర్యంలో దుర్గాపురంలోని శివరామకృష్ణ క్షేత్రం విద్యాభారతి శ్రవణ సదనంలో నిర్వహిస్తున్న 31 వ వార్షిక సంగీతోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. బుధవారం నాటి కార్యక్రమంలో అంతర్జాతీయ కర్నాటక సంగీత విద్వాంసులు, సంగీత ప్రయోక్త విఘ్నేష్ ఈశ్వర్ నిర్వహించిన కచేరీ మధురంగా సాగింది. త్యాగరాజ స్వామి కృతి జగదానందకారక కీర్తనతో ప్రారంభించి, వందే వాసుదేవంతో పాటు పలు సంప్రదాయ కీర్తనలను ఆలపించారు. వయోలిన్‌పై కేవీ కృష్ణ, మృదంగంపై కె.సద్గురు చరణ్, ఘటంపై ఎం.చంద్రకాంత్ సహకరించారు. సంగీత విద్వాంసులను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు.

**నేటి కార్యక్రమాలు:** సాయంత్రం 6.30 గంటలకు హేరంబ్, హేమంత్ వేణునాదన. ప్రవేశం ఉచితం.

### రాజ్యాంగాన్ని బాధ్యతగా వినియోగించుకోవాలి



**మధురానగర్(విజయవాడసెంట్రల్):** విద్యార్థులు భారత రాజ్యాంగంపై అవగాహన పెంపొందించుకోవటంతో పాటు రాజ్యాంగాన్ని బాధ్యతగా వినియోగించుకోవాలని మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకుడు డాక్టర్ డీఎస్‌వీఎస్ బాలసుబ్రహ్మణ్యం సూచించారు. స్థానిక ఆంధ్ర లయోలా కళాశాలలో రాజకీయ శాస్త్ర విభాగం ఆధ్వర్యాన రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా అతిథి ఉపన్యాసం జరిగింది. కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని భారత రాజ్యాంగం గురించి వివరించారు. భారత రాజ్యాంగంలోని ప్రజాస్వామం, సమానత్వం, మత స్వేచ్ఛ, రాజ్యాంగంలోని విలువలను గురించి వివరించారు. కార్యక్రమంలో పి.ఆర్.జాన్, డాక్టర్ ప్రభుదాస్, వైస్ ప్రిన్సిపాల్ కిరణ్ కుమార్, డాక్టర్ పూర్ణిమ, డాక్టర్ శామ్యూల్ దయాకర్ తదితరులు పాల్గొని మాట్లాడారు.

### చికిత్స పొందుతూ యువకుడు మృతి

**గాంధీనగర్(విజయవాడసెంట్రల్):** ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. వాంబే కాలనీకి చెందిన ఓలేటి విఘ్నేష్ ఆర్టీసీ క్రాస్ రోడ్డులోని ఎస్.కన్వెన్షన్‌లో తన స్నేహితుడి రిసెప్షన్‌కు ఈనెల 19వ తేదీ రాత్రి బైక్‌పై వెళ్లాడు. ఆ సమయంలో ఎదురుగా వస్తున్న బైక్ విఘ్నేష్ నడుపుతున్న బైక్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో విఘ్నేష్ తలకు బలమైన గాయాలయ్యాయి. స్నేహితులు అతనిని ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం ఉదయం విఘ్నేష్ మృతి చెందాడు. విఘ్నేష్ తల్లి సుబ్బలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు భవానీపురం పోలీసులు కేసు నమోదు చేశారు.

# ప్రమాదకరంగా డీఎస్ఓ కార్యాలయ ప్రహరీ

**ప్రహరీకి ఆనుకుని నిర్మించిన టాయిలెట్లపై పెరిగిన చెట్లు**



నెర్రెలిచ్చి వాలిన కార్యాలయ ప్రహరీ

**గాంధీనగర్(విజయవాసెంట్రల్):** గాంధీనగర్ తాలూకా కార్యాలయ ఆవరణలోని జిల్లా పౌర సరఫరాల అధికారి కార్యాలయం(డీఎస్ఓ) ప్రహరీ ప్రమాదకరంగా మారింది. దశాబ్దాల క్రితం గ్రౌండ్, ఫస్ట్ ఫ్లోర్‌తో డీఎస్ఓ కార్యాలయ భవన నిర్మాణం చేశారు. రోడ్డు కంటే నాలుగు అడుగుల ఎత్తు ప్లాట్‌ఫారం ఏర్పాటు చేసి దానిపై భవనాన్ని నిర్మించారు. అయితే ప్రహరీని భూమిపై నుంచి కాకుండా ప్లాట్‌ఫారంపైనే నిర్మించారు. ఈ ప్రహరీపై రావి చెట్లు మొలిచాయి. చెట్ల వేర్లు ఏపుగా పెరగడంతో రెండు మూడు చోట్ల నెర్రెలిచ్చింది. ప్రహరీ వెనుకకు వాలిపోయింది. భవనానికి వెనుక భాగంలో వీఆర్వోల అసోసియేషన్ భవనం ఉంది. కార్యాలయ ఆవరణలో ఓ కుటుంబం వైరింగ్ పనులు చేసుకుంటోంది. వారు నిత్యం ఈ ప్రహరీ పక్కనే కూర్చుని పనులు చేసుకుంటున్నారు. ప్రహరీ అడుగున్నర మేర వాలిపోయి కూలిపోతుందేమోనన్నట్లుగా ఉంది. ఈ ప్రహరీకి ఆనుకుని కార్యాలయ సిబ్బందికి, కార్యాలయానికి వచ్చే వారి కోసం టాయిటెట్లు నిర్మించారు. టాయిలెట్ల శ్లాబుకు, ప్రహరీకి మధ్య పెద్ద రావి చెట్టు మొలిచింది. చెట్టు వేర్లు బలంగా తయారవడంతో టాయిలెట్ల లోపలి భాగంలో నెర్రెలిచ్చి గోడ పగిలిపోయింది. టాయిలెట్ గోడలు చీలిపోయి డోర్‌లు పడని పరిస్థితి ఏర్పడింది. డీఎస్వో కార్యాలయ మహిళా సిబ్బంది ఈ టాయిలెట్లనే వినియోగిస్తున్నారు. తలుపులు సరిగా లేకపోవడం, లోపల నిర్వహణ అధ్వానంగా ఉండడంతో అవస్థలు పడుతున్నారు. పురుషులు తాలూకా వెలుపల ఉన్న టాయిలెట్లు లేదా పై అంతస్తులో ఉన్న వాటిని వినియోగిస్తున్నారు. మహిళా ఉద్యోగులు తప్పనిసరి పరిస్థితుల్లో శిథిలమైన గోడకు నిర్మించిన టాయిలెట్లే వాడక తప్పడం లేదు. ఆ చెట్ల నుంచి రాలే ఆకులు, వేర్లు లోపలికి దిగి పలు రకాల కీటకాలు అందులోకి చేరుతున్నాయి. కార్యాలయంలో ఉన్న కొద్దిమంది మహిళా సిబ్బంది అసౌకర్యంగా ఉన్నప్పటికీ వాటిని వాడక తప్పడం లేదు. ప్రహరీకి కాకుండా విడిగా టాయిలెట్లు నిర్మించి ఉంటే బాగుండేదనే అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. పైగా మెట్ల వెనుక నుంచి టాయిలెట్లకు వెళ్లాల్సి రావడం, ఆ సమయంలో పై అంతస్తులోకి వచ్చి వెళ్లే వారు ఎక్కువగా ఉండడం, తలుపులు సక్రమంగా లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు. టాయిలెట్స్‌పై శ్లాబు ఎప్పుడు కూలుతుందోనన్న భయంతో సిబ్బంది ఉన్నారు. టాయిలెట్లు, ప్రహరీ నెర్రెలు పూడ్చి వేసి కూలిపోకుండా ఒకటి రెండు చోట్ల పిల్లర్లు వేస్తే ప్రహరీ బలంగా ఉంటుంది లేదా పూర్తిగా కూల్చి వేసి కొత్త ప్రహరీ నిర్మించాలి. మహిళా సిబ్బందికి అసౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రస్తుత అవసరాలకు తగిన విధంగా టాయిలెట్లు నిర్మించి సౌకర్యాలు కల్పించాలి. దీనిపై అధికారులు దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది.



ప్రహరీకి ఆనుకుని నిర్మించిన టాయిలెట్లపై పెరిగిన రావి చెట్టు

## మొబైల్ సైన్స్ ఎగ్జిబిషన్ ఎంతో ఉపయోగకరం

**జిల్లా విద్యాశాఖాధికారి యూవీ సుబ్బారావు**



డీఈఓ సుబ్బారావుకు ప్రాజెక్టుల గురించి వివరిస్తున్న సైన్స్ సెంటర్ నిర్వాహకులు

**అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్):** సైన్స్ సబ్జెక్ట్‌పై సరైన అవగాహన ఉంటే ఎన్నో సరికొత్త ఆవిష్కరణలను తయారుచేయవచ్చని, తిరుపతి సైన్స్ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మొబైల్ సైన్స్ ఎగ్జిబిషన్ విద్యార్థినీ విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉందని జిల్లా విద్యా శాఖాధికారి యూవీ సుబ్బారావు అన్నారు. మొబైల్ సైన్స్ ఎగ్జిబిషన్ బస్సు బుధవారం సింగ్‌నగర్ ఎంకే బేగ్ స్కూల్‌కు చేరుకుంది. స్థానిక ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి రిబ్బన్ కట్‌చేసి ఆయన ఈ ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. నిర్వాహకులతో మాట్లాడి ఎగ్జిబిషన్‌లో అందుబాటులో ఉంచిన మోడల్స్ గురించి తెలుసుకొని వాటిని విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు సైన్స్‌పై ఆసక్తి పెంచేందుకు చేపట్టిన ఈ మొబైల్ సైన్స్ ఎగ్జిబిషన్‌లో అనేక సైన్స్ అంశాలను పొందుపరిచారని, ప్రధానంగా ఇందులో పొందుపరిచిన 20 ఎక్సలెంట్ మోడల్స్ గురించి ప్రతి విద్యార్థి కచ్చితంగా తెలుసుకోవాలని సూచించారు. సింగ్‌నగర్, పాయకాపురం పరిసర ప్రాంతాల్లోని విద్యార్థుల ఉపయోగం కోసం దీనిని ఏర్పాటుచేశామన్నారు. బెంగళూరు మ్యూజియం, తిరుపతి సైన్స్ సెంటర్ వారు కలసి ఈ ప్రోగ్రాంను రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్నారని తెలిపారు. ఏపీసీ ఉమామహేశ్వరరావు, పాఠశాల హెచ్‌ఎం పరసా వెంకటేశ్వరరావు, జిల్లా సైన్స్ అధికారి డాక్టర్ మైనం హుస్సేన్, సైన్స్ టీచర్లు మనోహర్, ప్రశాంతి, కృష్ణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## దర్శకేంద్రుడు రాఘవేంద్రుడు



**విజయవాడకల్చరల్:** తెలుగు సినీ దర్శకులలో దర్శకేంద్రుడు రాఘవేంద్రరావు అని మహానటి సావిత్రి కళాపీఠం వ్యవస్థాపకురాలు పరుచూరి విజయలక్ష్మి అన్నారు. మహానటి సావిత్రి సాహిత్య కళాపీఠం సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో బుధవారం సినీ దర్శకుడు రాఘవేంద్రరావు దర్శకత్వం వహించిన సినీ చిత్రగీతాలు, గాయనీ గాయకులకు సత్కార కార్యక్రమం నిర్వహించారు. విజయలక్ష్మి మాట్లాడుతూ రాఘవేంద్రరావు 75 చిత్రాలకు దర్శకత్వం వహించి, అనేకమంది నటీ నటులను తెలుగు తెరకు పరిచయం చేసినట్లు తెలిపారు. వివిధ రంగాల ప్రతినిధులు వడ్డాది కామేశ్వరి, ప్రభల శ్రీనివాస్, ఎంఎస్ నారాయణ, కె.డేవిడ్‌రాజు, డి.వీరబద్రరావు, కొప్పుల ఆనంద్, చావా నరసింహారావు, ప్రసూనా రామన్ తదితరులు రాఘవేంద్రరావు జీవిత విశేషాలను వివరించారు. అనంతరం రాఘవేంద్రరావు దర్శకత్వం వహించిన చిత్రాలలోని పాటలను గాయనీ గాయకులు సుశీల్‌కుమార్, పి.శ్రీనివాసరావు, అయ్యప్పన్, కిరణ్, స్వాతి మీరాకుమార్, బెల్లంకొండ భారతి, ఉమా మహేశ్వరి ఆలపించారు. నిర్వాహకులు గాయనీ గాయకులను ఆత్మీయంగా సత్కరించారు.

## కౌన్సిల్ అజెండాపై మేయర్ సమీక్ష

**పటమట(విజయవాడతూర్పు):** విజయవాడ నగర పాలక సంస్థ మేయర్ రాయన భాగ్యలక్ష్మి బుధవారం శాఖాధిపతులతో కౌన్సిల్ అజెండాపై ప్రధాన కార్యాలయంలోని తన చాంబర్ లో సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో కౌన్సిల్ అజెండా, అదనపు అజెండాలో ఉన్న ప్రతి ప్రతిపాదనను శాఖాధిపతులతో చర్చించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగర అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం సభ్యులు ఇచ్చిన ప్రతిపాదనలకు అధికారులందరూ సహకరించాలని, ప్రజల కోసం విజయవాడ నగరపాలక సంస్థ ఎల్లప్పుడూ తోడుగా ఉండాలని అన్నారు. సమావేశంలో అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్స్) డాక్టర్ డి.చంద్రశేఖర్, చీఫ్ ఇంజినీర్ ఆర్.శ్రీనాథరెడ్డి, ఇన్‌చార్జి చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్ బాబు, చీఫ్ సిటీ ప్లానర్ జీవీజీఎస్‌వీ ప్రసాద్, డెప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) సృజన, సూపరింటెండెంట్ ఇంజినీర్లు సత్యనారాయణ, సత్య కుమారి, అకౌంట్స్ ఎగ్జామినర్ చక్రవర్తి, సెక్రటరీ వసంత లక్ష్మి, ఎస్టేట్ ఆఫీసర్ శ్రీనివాస్, డెప్యూటీ డైరెక్టర్ హార్టికల్చర్ రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న వీఎంసీ మేయర్ రాయన భాగ్యలక్ష్మి

## దేశ్ కి ప్రకృతి పరీక్ష అభియాన్ ప్రచారం ప్రారంభం



**గాంధీనగర్(విజయవాడసెంట్రల్):** ఆరోగ్యాన్ని సమతుల్యంగా ఉంచుకునేందుకు ప్రకృతి పరీక్ష (మానవ శరీర రాజ్యాంగం గురించి తెలుసుకోవడం) దోహదపడుతుందని ఆంధ్రా బోర్డ్ ఫర్ ఆయుర్వేద అడిషనల్ డైరెక్టర్, రిజిస్ట్రార్ వై.శేఖర్ అన్నారు. ప్రకృతి పరీక్షను ప్రోత్సహించడం, దాని ప్రయోజనాల గురించి విస్తృత అవగాహన కల్పించడమే లక్ష్యంగా ఆయుష్ డిపార్ట్‌మెంట్ దేశ్‌కి ప్రకృతి పరీక్ష అభియాన్ ప్రచార కార్యక్రమం ప్రారంభించిందన్నారు. బుధవారం బీసెంట్ రోడ్డులోని ఇన్‌కాప్స్ వద్ద ప్రచార కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ ప్రచారోద్యమం డిసెంబర్ 25 వరకు జరుగుతుందన్నారు. ఇందులో భాగంగా పాఠశాలలు, కళాశాలలు, కమ్యూనిటీ సెంటర్లలో వర్క్‌షాపులు నిర్వహిస్తామన్నారు. ఉచిత ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేసి ప్రజలకు వైద్య పరీక్షలు చేస్తారన్నారు. కార్యక్రమంలో ఇన్‌కాప్స్ డైరెక్టర్ డాక్టర్ వేముల భాను ప్రకాష్, నేషనల్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ ప్రసాదరావు, ఆయుర్వేద స్టోర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పసుపులేటి శ్రీనివాస రావు పాల్గొన్నారు.

## లింగ సమానత్వంతోనే సమగ్ర అభివృద్ధి సాధ్యం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ భాగ్యలక్ష్మి, వేదికపై దళిత స్త్రీ శక్తి కన్వీనర్ ఝాన్సీ తదితరులు

**మధురానగర్(విజయవాడసెంట్రల్):** లింగ సమానత్వంతోనే సమగ్ర అభివృద్ధి సాధ్యమని దళిత స్త్రీ శక్తి రాష్ట్ర కన్వీనర్ జి.ఝాన్సీ అన్నారు. స్థానిక మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం లింగ సమానత్వంపై అవగాహన కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మహిళల హక్కులను ప్రోత్సహించే సామాజిక మార్పును తీసుకురావటానికి విద్య అత్యంత శక్తివంతమైన సాధనం అన్నారు. టీచర్‌లు విద్యావ్యవస్థకు మూల స్తంభం కాబట్టి పాఠశాల స్థాయి నుంచే మార్పుకు ప్రయత్నించాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి మాట్లాడుతూ లింగ సమానత్వం అనేది ప్రాథమిక మానవ హక్కు మాత్రమే కాదని, శాంతియుత, సంపన్నమైన, స్థిరమైన ప్రపంచానికి అవసరమైన పునాది అని అన్నారు. కార్యక్రమంలో కళాశాల మహిళా సాధికార కన్వీనర్ కె.అరుణ, డి.రాజ్యలక్ష్మి, ఎస్ఎల్‌జానకి తదితరులు పాల్గొన్నారు.

## వరద ముంపు యువతకు ఉచిత శిక్షణ అభినందనీయం

**బీఐఆర్ఈడీ డైరెక్టర్ ఈ.నాగరాజకుమార్**



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న నిర్వాహకులు

**అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్):** బుడమేరు వరద ముంపు ప్రాంతంలోని యువత ఆర్థిక అభ్యున్నతికి తోడ్పడాలనే ఆకాంక్షతో బీఐఆర్ఈడీ (బ్యాంకర్స్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రూరల్, ఎంట్రప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్), శ్రీసత్యసాయి సేవా సమితి సంయుక్త ఆధ్వర్యంలో పలు రంగాల్లో ఉచిత శిక్షణ ఇవ్వడం అభినందనీయమని బీఐఆర్ఈడీ డైరెక్టర్ ఇ.నాగరాజకుమార్ అన్నారు. సింగ్ నగర్, పాయకాపురం, రాజీవ్‌నగర్ పరిసర ప్రాంతాల్లోని 41 మంది యువతకు శ్రీసత్యసాయిసేవాసమితి, బ్యాంకర్ల గ్రామీణ, ఔత్సాహికుల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో రాజీవ్ నగర్ భారత్ వికాస్ పరిషత్ భవనంలో ఏసీ, ఫ్రిజ్, వాషింగ్ మెషిన్ మెకానిజంలో నెల రోజుల పాటు ఉచిత శిక్షణ కేంద్రాన్ని నిర్వహించారు. శిక్షణ ముగింపు వేడుకలు బుధవారం జరిగాయి. దీనికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ బుడమేరు వరద ముంపుతో సింగ్‌నగర్ పరిసర ప్రాంతాల ప్రజలు ఆర్థికంగా ఎంతో నష్టపోయారని, వారిలోని కొంతమందికైనా ఆర్థిక అభ్యున్నతిని అందించాలనే ఆకాంక్షతో ఈ శిక్షణ కార్యక్రమం చేపట్టినట్లు వివరించారు. శ్రీసత్యసాయి సేవా సంస్థల రాష్ట్ర సేవాదళ్ కోఆర్డినేటర్ కొమరగిరి శ్యామ్‌ప్రసాద్ మాట్లాడుతూ ఇక్కడ శిక్షణ తీసుకున్న వారు కొంతకాలం బయట కూడా పనిచేసి మరింత నైపుణ్యం పెంచుకోవాలని సూచించారు. వీరందరిని పుట్టపర్తికి తీసుకువెళ్లి బాబా వారి సన్నిధిలో ఉచితంగా టూల్ కిట్స్‌ను అందజేస్తామని తెలిపారు. రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌చార్జ్ ఓ.నాగప్రసాద్, ఎల్‌జీ కంపెనీ డెప్యూటీ జనరల్ మేనేజర్ ఉపేంద్ర, ఏసీ టెక్నీషియన్స్ జిల్లా అధ్యక్షుడు దివాకర్, బీవీఎస్‌టీ శాయి, ఎస్‌వీఎల్ నరసింహరావు, జిల్లా సేవాదళ్ కోఆర్డినేటర్ శ్రీనివాస్, సమితి సేవాదళ్ ఇన్‌చార్జ్ తులసీరాం, శేఖర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం శిక్షణ పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.

## బాల్య వివాహాల నిరోధం అందరి బాధ్యత

**చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యురాలు చంద్రగిరి రాధాకుమారి**



**గాంధీనగర్(విజయవాడసెంట్రల్):** బాల్య వివాహాలను అరికట్టాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని న్యాయవాది, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యురాలు చంద్రగిరి రాధాకుమారి అన్నారు. గాంధీనగర్‌లోని శారద కళాశాలలో బుధవారం బాల్య వివాహ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాధాకుమారి మాట్లాడుతూ బాల్య వివాహాల వలన కలిగే అనర్థాలను వివరించారు. బాల్యంలో వివాహాలు చేయడం వలన ఆరోగ్యం దెబ్బతింటుందన్నారు. బాల్య వివాహాలు చట్ట రీత్యా నేరమన్నారు. విద్యార్థినులు సరైన అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్నట్లు తెలిస్తే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, సచివాలయ మహిళా పోలీసులు, లేదా 1098 నంబర్లకు ఫోన్ చేస్తే బాల్య వివాహాలను అడ్డుకుంటారన్నారు. పేదరికం వల్లనో, ఇతర కారణాల చేతనో బాల్య వివాహాలు చేసే వారికి అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ లుక్కా శ్రీధర్, వైస్ ప్రిన్సిపాల్ రోజేష్ కుమార్, అర్థ శాస్త్ర అధ్యాపకురాలు రత్నకుమారి పాల్గొన్నారు.

# రైతుల గోడు ప్రభుత్వానికి పట్టదా..?

**వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త మల్లాది విష్ణు**



**మధురానగర్(విజయవాడసెంట్రల్):** సార్వా ధాన్యం సేకరణలో ఎదురవుతున్న ఇబ్బందులను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కృష్ణా జిల్లా కంకిపాడు మండలం పునాదిపాడు, కోలవెన్ను గ్రామాల్లో అన్నదాతలు పడుతున్న అవస్థలపై ఆయన తీవ్రంగా స్పందించారు. రైతులకు కనీసం సంచులు, రవాణా సౌకర్యం కూడా ఏర్పాటు చేయలేని దయనీయ స్థితిలో కూటమి ప్రభుత్వం ఉందని మండిపడ్డారు. మిల్లర్లు, వ్యాపారులు లాలూచీ పడి ధాన్యం ధరను తగ్గిస్తున్నారని, సాక్షాత్తూ క్యాబినెట్ మంత్రి ముందు అన్నదాతలు కన్నీటి పర్యంతమవుతున్నా ప్రభుత్వంలో కనీస చలనం లేదన్నారు. అదే గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రైతులకు ఎంతో మేలు జరిగిందని మల్లాది విష్ణు గుర్తుచేశారు. 75 కిలోల బస్తా రూ.1,600 ఉంటే రైతుకు రూ.1,550 వరకు గిట్టుబాటు అయిందని, కానీ ఇప్పుడు 75 కిలోల బస్తా రూ.1,720 ఉన్నా రైతుకు రూ.1,420 కి మించి దక్కడం లేదన్నారు. గత ప్రభుత్వంలో 25 నుంచి 27 తేమ శాతం ఉన్నా రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం కొన్నారని, ఇప్పుడు తేమ నెపంతో మద్దతు ధర కంటే మూడు వందలు తగ్గించడం సరికాదన్నారు. మరోవైపు తుఫాన్ హెచ్చరికతో కల్లాలు, రహదారులపై ధాన్యం నిల్వ ఉంచిన రైతులకు కంటిమీద కునుకు లేకుండా పోయిందన్నారు. కోలవెన్ను పరిధిలోనే వేల బస్తాల ధాన్యం బయట ఉందని చెప్పారు. ఈ పరిస్థితిలో 22 శాతం లోపు తేమ ఉంటేనే కొంటామని ప్రభుత్వం చెప్పడం దారుణమన్నారు. కనుక ప్రభుత్వం వెంటనే రైతులకు సంచులు, రవాణా వాహనాలు ఏర్పాటు చేయాలని కోరారు. అన్నదాతలను ఇబ్బంది పెడుతున్న మిల్లులపై కఠిన చర్యలు తీసుకోవాలని మల్లాది విష్ణు డిమాండ్ చేశారు.

## సమర్థ పారిశుద్ధ్య విధానాన్ని అవలంబించాలి

**పటమట(విజయవాడతూర్పు):** విజయవాడ నగరంలో ప్రతినిత్యం సమర్థమైన పారిశుద్ధ్య విధానాన్ని అవలంబించాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. నగర పర్యటనలో భాగంగా ఆయన బుధవారం సత్యనారాయణపురం, సింగ్ నగర్, ఎక్సెల్ ప్లాంట్, బీసెంట్ రోడ్, పరిసర ప్రాంతాలన్నీ పర్యటించి క్షేత్రస్థాయిలో పారిశుద్ధ్య నిర్వహణను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నగరంలో పారిశుద్ధ్య నిర్వహణలో ఎటువంటి లోపం లేకుండా ఉండాలని, క్లీన్ ఆంధ్రప్రదేశ్(క్లాప్) వాహనాల డ్రైవర్లు సమ్మె చేస్తున్నందున ఇంటింటి చెత్త సేకరణలో, సేకరించిన చెత్త తరలింపులో నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దని, వ్యర్థాల తరలింపునకు ట్రాక్టర్ల సంఖ్యను మరింత పెంచి సమర్థమైన పారిశుద్ధ్య నిర్వహణ చేయాలని ప్రజారోగ్యం విభాగం అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ ఇన్‌చార్జి డాక్టర్ సురేష్ బాబు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వెహికల్ డిపో ఇన్‌చార్జి ఏసుపాదం పాల్గొన్నారు.



ప్రజారోగ్య విభాగం అధికారులకు సూచనలిస్తున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

## బస్టాండ్‌లో 73 సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటు

**సాక్షి ఎఫెక్ట్**

**బస్టాండ్(విజయవాడ పశ్చిమ):** పండిట్ నెహ్రూ బస్ స్టేషన్‌లో బ్లేడ్ బ్యాచ్ ఆగడాలపై 'సాక్షి' దిన పత్రికలో బుధవారం ప్రచురితమైన 'బ్లేడ్ బ్యాచ్‌కు అడ్డా.. నెహ్రూ బస్‌స్టేషన్' కథనానికి ఆర్టీసీ అధికారులు స్పందించారు. బస్టాండ్‌లో 73 సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేసినట్లు డెప్యూటీ ట్రాఫిక్ మేనేజర్ ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. ప్రతి రోజూ ఇద్దరు ట్రాఫిక్ సూపర్ వైజర్లు, ఇద్దరు ఆర్టీసీ కానిస్టేబుళ్లు అవుట్ పోస్ట్ పోలీస్ సిబ్బందితో కలిసి ఒక టీమ్‌ను ఏర్పాటు చేసి నిరంతరం నిఘా ఏర్పాటు చేశామన్నారు. బస్టాండ్‌లో ప్రతి రెండు గంటలకు ఒకసారి తిరిగి అపరిచితులు (ప్రయాణికులను మినహాయించి) కనిపిస్తే వారి వద్దనుంచి వివరాలు తీసుకుని అవసరమైన వారికి కౌన్సెలింగ్ ఇచ్చి పంపించటంతో పాటు అనుమానిత వ్యక్తులను కృష్ణలంక పోలీస్ సిబ్బందితో విచారించే చర్యలు చేపట్టినట్లు తెలిపారు. విధుల్లో ఉన్న ఆర్టీసీ సిబ్బందిపై ఎటువంటి దాడులు జరగకుండా గట్టి చర్యలు తీసుకున్నామన్నారు. ప్రయాణికులు, సిబ్బందిపై దాడులకు పాల్పడిన వారిపై పోలీసులు గట్టి చర్యలు తీసుకుంటారని తెలిపారు. ప్రయాణికులు ఎటువంటి భయాందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు.

## వైభవంగా కార్తిక దీపోత్సవం



**విజయవాడకల్చరల్:** శత సహస్ర దీపార్చనా సేవా మండలి ఆధ్వర్యంలో సత్యనారాయణపురంలోని విజ్ఞానవిహార్ స్కూల్‌లో నిర్వహిస్తున్న కార్తికమాస ఉత్సవాలు బుధవారం లక్ష దీపార్చనతో ముగిశాయి. అర్చక స్వాములు పరమేశ్వరునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దీపం జ్యోతి పరబ్రహ్మ, దీపం జ్యోతి పరాత్పర మంత్ర జపం చేస్తూ దీపాలను వెలిగించారు. వివిధ ఆకృతులతో దీపాలను వెలిగించారు. ఓంకార నాదంతో పరిసరాలు ప్రతిధ్వనించాయి. ముఖ్య అతిథిగా పాల్గొన్న తాళ్ళాయపాలెం శైవ పీఠాధిపతి శివస్వామి మాట్లాడుతూ కార్తిక మాసంలో శివారాధన చేయడం, భక్తిగా శివనామస్మరణ చేయడం అలవాటు చేసుకోవాలన్నారు. శత సహస్ర దీపార్చనా సేవా మండలి వ్యవస్థాపకుడు నాగలింగం శివాజీ మాట్లాడుతూ గత 16 సంవత్సరాలుగా కుల మతాలకు అతీతంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భారతీయ సనాతన ధర్మం విశిష్టమైనదని, నేటి యువతను భక్తి మార్గం వైపు మళ్లించాల్సిన అవసరముందన్నారు. ప్రముఖ సంస్కృత పండితులు చల్లా లక్ష్మీనారాయణ, అవ్వారు బుల్లెబ్బాయ్, శేషుబాబు పాల్గొన్నారు.

### ఆకట్టుకున్న చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు

**అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్):** సింగ్‌నగర్ మాకినేని బసవపున్నయ్య మున్సిపల్ స్టేడియం ఆవరణలో బుధవారం సాయంత్రం నిర్వహించిన కల్వరి గ్రాండ్ క్రిస్మస్ సెలబ్రేషన్స్ ఘనంగా జరిగాయి. ముందుగా చిన్నారులు, యువత ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం బ్రదర్ పి.సతీష్‌కుమార్ క్రిస్మస్ సందేశాన్ని అందించారు. అనంతరం నిర్వహించిన క్యాండిల్ లైట్ సర్వీస్, క్రిస్మస్ కేక్ కటింగ్ కార్యక్రమాలు ఉత్సాహభరితంగా జరిగాయి.



### రామలింగేశ్వరునికి తులసి పూజ

**మధురానగర్(విజయవాడసెంట్రల్):** ముత్యాలంపాడు శ్రీపార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి వారి దేవాలయంలో కార్తిక మాసోత్సవాలలో భాగంగా బుధవారం రామలింగేశ్వర స్వామికి విశేషంగా తులసీదళం, పుష్పాలతో అర్చనలు నిర్వహించారు. స్వామివారికి ప్రీతికరమైన మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం శాస్త్రోక్తంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి దీపారాధనలు చేశారు.

**రేపు అన్నప్రసాద వితరణ**

కార్తిక మాసోత్సవాలలో భాగంగా ఈనెల 29వ తేదీ శుక్రవారం ఉదయం 11.30 గంటల నుంచి అన్నప్రసాద వితరణ నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షులు డీవీఎస్ రాజు తెలిపారు. సాయంత్రం పార్వతీసమేత రామలింగేశ్వరస్వామివారి కల్యాణం జరుగుతుందన్నారు. వచ్చే నెల ఒకటో తేదీన 15 కిలోల కర్పూరంతో కర్పూర హారతి, 100 కిలోల ఆవు నెయ్యితో అఖండ జ్యోతి ప్రజ్వలన నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని ఆయన కృపకు పాత్రులు కావాల్సిందిగా ఆయన కోరారు.

### నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

**మధురానగర్(విజయవాడసెంట్రల్):** ముత్యాలంపాడు సెక్షన్ 11 కేవీ నల్ల గేటు ఫీడర్ పరిధిలో విద్యుత్ వైర్లు మరమ్మతుల దృష్ట్యా గురువారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ పి.రవీంద్ర బాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తాడంకి వారి స్ట్రీట్, రామాలయం వీధి, గడియారం వారి వీధి ,అబ్బూరు వారి వీధి, వ్యాకరణం వారి వీధి, ముదిగొండ వారి వీధి, తిరుమల శెట్టి వారి వీధి తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు. విద్యుత్ వినియోగదారులు ఈ విషయం గమనించి సహకరించాలని ఆయన కోరారు.